# ఫుట్‌పాత్‌లు..ఆక్రమణలు

**అధికారులు ఎంతవరకు స్పందిస్తారో చూడాలి**

- కనిపించని మహాత్మాగాంధీ ఫుట్‌పాత్‌లు
- ఆక్రమణలు లేకుండా చూడాలన్నందుకే ఏసీపీ స్థాయి అధికారి బదిలీ
- నరకం చూస్తున్న పాదచారులు, వాహనదారులు

*సికింద్రాబాద్ పట్టణానికి మహాత్మాగాంధీ రోడ్డు గుండె కాయ లాంటిది. అలాంటి ఈ రోడ్డు పూర్తిగా ఫుట్‌పాత్ ఆక్రమణలతో కుంచించుకుపోయింది. జంట నగరాలను కలిపే ఈ రోడ్డు లష్కర్‌లో ప్రధాన రహదారి. ప్యారడైజ్ నుంచి మహాత్మాగాంధీ రోడ్డు మీదుగా ట్యాంక్‌బండ్, మినిస్టర్ రోడ్డు, రాణిగంజ్, రాష్ట్రపతి రోడ్డు, మహంకాళి వీధి, టుబాకో బజార్, పార్కులైన్ సెంటర్‌ను కలుపుతూ ఈ రోడ్డు కొనసాగుతున్నది. రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద షాపులు ఉన్నాయి. వినియోగదారులు, పాదచారులు నడిచేందుకు రోడ్డుకు ఇరు వైపులా జీహెచ్‌ఎంసీ ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేసింది. కానీ కొంతకాలంగా ఈ రోడ్డులో ఫుడ్‌సెంటర్స్‌తో పాటు వివిధ రకాల వ్యాపారాలు అధికంగా వెలిశాయి.*
*– బేగంపేట్, మే 31*



మహాత్మాగాంధీ రోడ్డులో ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న ఫుడ్‌సెంటర్స్

- ప్రధానంగా ఎంజీ రోడ్డులో ట్యాంక్‌బండ్‌వైపు నుంచి ప్యారడైజ్‌కు వస్తున్న క్రమంలో నల్లగుట్ట మసీదుకు ముందు భాగంలో ఆజం ఫుడ్ రెస్టారెంట్ వెలిసింది. ఈ రెస్టారెంట్ నిర్వాహకులు మెయిన్‌రోడ్డు, మసీదు రోడ్డు రెండు వైపులా భారీగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రధాన రోడ్డు, మసీదు రోడ్డులో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ జాం అవుతున్నది. అంతేకాకుండా ఈ సెంటర్‌ను తెల్లవారు జామున 3 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు బస్తీ వాసులు తెలిపారు. దీంతో అర్ధరాత్రి వరకు ఆకతాయిలు, మద్యం బాబులు తిష్టవేస్తున్నట్టు బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెస్టారెంట్‌కు వచ్చే వారితో పాటు నల్లగుట్టలో రెడిమేడ్ వ్యాపార లావాదేవీల కోసం వచ్చే వారితో ఆ ప్రాంతమంతా కిక్కిరిసి ఉంటుంది.
- ఇక్కడ కొంతమంది స్థానిక మీడియా ప్రతినిధులు, ఓ ట్రాఫిక్ పై స్థాయి అధికారి కలిసి రెస్టారెంట్ నిర్వాహకుల నుంచి భారీగా మామూళ్లు తీసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ట్రాఫిక్ అధికారులు అటువైపు వెళ్లద్దనే సూచనలు చేస్తున్నారని అందుకే చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.
- సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై అక్రమ వ్యాపారాలను తొలగించి పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.
- ట్రాఫిక్ జాంపై స్థానిక మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నం చేయగా స్పందించలేదు.

### ఆక్రమణలు వద్దన్నందుకే ఓ అధికారి బదిలీ

సికింద్రాబాద్ ఎంజీ రోడ్డు, రాష్ట్రపతి రోడ్డు, టుబాకోబజార్, మోండా మార్కెట్, జనరల్ బజార్, రాణిగంజ్ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు అధికంగా ఉంటాయి. వాహనం వెళ్లాలన్నా, రావాలన్నా సుమారు 20 నిమిషాలు పడుతుంది. ఇటీవల బేగంపేట్ టీటీఐ నుంచి నార్త్‌జోన్ ఏసీపీగా శంకర్రాజు అనే అధికారి బాధ్యతలు తీసుకున్నారు. శంకర్రాజు వచ్చినప్పటి నుంచి ఆయా ట్రాఫిక్ పోలీసులను కఠినంగా మందలిస్తూ ఎక్కడా కూడా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, ఆక్రమణదారులపై వెను వెంటనే చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.
దీంతో ఏసీపీ తాకిడిని తట్టుకోలేక అతడిని ఇక్కడి నుంచి బదిలీ చేయించారు. ఈ విషయం ఉత్తర మండలంలో అన్ని విభాగాల పోలీసు అధికారులకు, బడా వ్యాపారులకు తెలిసిందే.

## నేడు కొవ్వొత్తుల ర్యాలీ

సికింద్రాబాద్,మే 31: బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నాంపల్లి , గన్ పార్క్ నుంచి సెక్రటేరియట్ అమరవీరుల స్మారక కేంద్రం వరకు నిర్వహించే కొవ్వొత్తుల ర్యాలీని విజయవంతం చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ కార్యాలయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ర్యాలీకి సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులు, ఉద్యమకారులు, కార్మిక విభాగాల నేతలు, అనుబంధ సంఘాల నేతలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపు నిచ్చారు.బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తో పాటు పెద్ద ఎత్తున నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ ర్యాలీలో సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ తదితర డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి

బొల్లారం,మే 31:కంటోన్మెంట్ ఏడో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్ అన్నారు.వార్డు పరిధిలోని పెరుమాల్ హట్స్ బస్తీ,పెద్ద కమేళాలోని డ్రైనేజీ,వీధి దీపాలు,మంచి నీటి సమస్యలతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం బోర్డు సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించామని శ్యామ్ కుమార్ తెలిపారు.

## పేదల హితమే లక్ష్యంగా ఎన్టీఆర్ కృషి..

ముషీరాబాద్: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా శుక్రవారం మా జీ సీఎం, పద్మశ్రీ నందమూరి తారక రామారావు జయంతి సభ జరిగింది. ఈ కార్యక్రమానికి గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళా జనార్దనమూర్తి మాట్లాడు తూ.. ఎన్టీఆర్ తెలుగు జాతికి గుర్తిం పు తీసుకొచ్చి, పేదల హితమే లక్ష్యం గా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు.

## పొగాకుతో ప్రాణాంతక వ్యాధులు




'పొగాకు వ్యతిరేక దినం' సందర్భంగా అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు

బన్సీలాల్‌పేట్, మే 31 : పొగాకు వినియోగం వలన మన దేశంలో ఏటా పది లక్షల మంది చనిపోతున్నారని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు అన్నారు.'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం' సందర్భంగా శుక్రవారం గాంధీ దవాఖానలో కుటుంబ సంక్షేమ లెక్చరర్ డి.వెంకట రామనర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజారావు మాట్లాడుతూ ప్రపంచంలో నోటి క్యాన్సర్స్ మరణాలు మనదేశంలో అధికంగా జరుగుతున్నాయని, పొగాకు తినడం, సేవించడం వల్లనే ఈ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. పొగాకులో వేల రకాల హానికరమైన రసాయనాలు ఉన్నాయని, అందు కే వాటి వాడకాన్ని నివారించాలని ఆయన సూచించారు. ప్రాణాంతక వ్యాధులైన ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, కాలేయ క్యాన్సర్, మధుమేహం లాంటి సమస్యలు పొగాకు వాడకం వల్లనే అని ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పల్మనాలజీ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, ఆర్‌ఎంఓ డాక్టర్ జయకృష్ణ పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

**బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్**



బాపూజీనగర్‌లో బోరు మరమ్మతులు చేయిస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన

కంటోన్మెంట్, మే 31: బోర్డు పరిధిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. కంటోన్మెంట్ ఒకటో వార్డు బాపూజీనగర్‌లో 30 ఏండ్లుగా ఆనాటి బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ చొరవతో ప్రతి రోజూ మంచి నీటిని బస్తీ వాసులకు ఇబ్బంది లేకుండా అందించారు. ఈ క్రమంలో ప్రస్తుతం మూడు రోజులకు ఒకసారి నీరు వస్తుందని కాలనీ వాసులు జంపన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బస్తీలో బోరు పాడైందని దానిని బాగు చేయించాలని బస్తీ వాసులు కోరడంతో జంపన్న బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే బోర్‌కు మరమ్మతులు చేసి 24 గంటలు బోరు నీటిని అందుబాటులోకి తెచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జంపన ప్రతాప్‌తో పాటు బోర్డు అధికారులకు బస్తీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అజిత్ కళ్యాణ్, కరణ్ సింగ్, శ్రీకాంత్, మల్లేష్, లక్ష్మణ్, కొమురయ్య, రామారావు, జగన్నాథం, పవన్,మైసమ్మ, లక్ష్మమ్మ, హనుమమ్మ పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులను అందజేసిన ఎన్‌టీపీసీ అధికారులు

బన్సీలాల్‌పేట్, మే 31 : నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) సంస్థ ఆధ్వర్యంలో దక్షిణ ప్రాంతీయ కేంద్ర కార్యాలయం ద్వారా చేపడుతున్న కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత కార్యక్రమాలలో భాగంగా మే 16 నుంచి 31 వరకు జరిగిన స్వచ్ఛతా పక్షోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ సహకారంతో చార్మినార్ వద్ద పారిశుద్ధ్య కార్యక్రమం, పలు పాఠశాలల విద్యార్థులకు పర్యావరణం గురించి, ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించేందుకు ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం అనే అంశంపై చిత్రలేఖనం, వ్యాసరచన, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించామని అధికారులు తెలిపారు. విజేతలకు ఎన్‌టీపీసీ డైరెక్టర్ ప్రసన్‌జిత్ పాల్, బి.డి.రావులు బహుమతులను అందజేసి అభినందనలు తెలిపారు. జనరల్ మేనేజర్ పాణిగ్రహి తమ ఎన్‌టీపీసీ చేపట్టిన ప్రజా ఉపయోగ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీపీసీ మేనేజర్ ప్రియాంక భూయాన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బస్తీవాసులకు ఇబ్బంది లేకుండా చూడండి

బంజారాహిల్స్: నిమ్స్ విస్తరణ పనుల్లో భాగంగా రామకృష్ణనగర్ బస్తీకి చెందిన మంచినీటి లైన్లు, సీవరేజీ లైన్లు దెబ్బతినకుండా చూడాలని ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి ఆర్ అండ్ బీ అధికారులను కోరారు. కొత్తగా నిర్మిస్తున్న నిమ్స్ భవనాల కోసం జరుపుతున్న తవ్వకాల్లో బస్తీకి చెందిన లైన్లు దెబ్బతింటున్నాయని, దీంతో మంచినీటి సమస్యలతో పాటు సీవరేజీ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఇటీవల ఆందోళన వ్యక్తం చేయడంతో కార్పొరేటర్ విజయారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు.

## మెట్ల బావుల పునరుద్ధరణకు ఓయూ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అధికారులు

ఉస్మానియా యూనివర్శిటీ, మే 31 : ఉస్మానియా యూనివర్శిటీలోని మెట్లబావుల పునరుద్ధరణ, బయోగ్యాస్ యూనిట్ ఏర్పాటు కోసం వివిధ సంస్థలతో ఉస్మానియా యూనివర్శిటీ అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. దీనికి సంబంధించి ఒప్పందపత్రాలపై ఇరువర్గాలు సంతకాలు చేసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఓయూలోని మూడు చారిత్రక మెట్లబావులను పునరుద్ధరించేందుకు సొసైటీ ఫర్ డీ అడ్వాన్స్‌మెంటు ఆఫ్ య్యూమన్ ఎన్‌డీవర్(ఎస్ఏహెచ్ఈ) అనే స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదర్చుకుంది. దీని ప్రకారం మెట్ల బావులను పునరుద్ధరించడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయనుంది. ఓయూలో ఘన వ్యర్థాల నిర్వాహణకు మరో స్వచ్ఛంద సంస్థ అయిన సాహస్, అహుజా ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ద్వైపాక్షిక ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ఓయూలో రెండు టన్నుల బయోను ఉత్పత్తి చేసే యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో ఓయూ అధికారులు పాల్గొన్నారు.




*దక్షిణకొరియా రాజధాని సియోల్ వేదికగా జరుగనున్న వరల్డ్ తైక్వాండో శిక్షణ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన కోచ్ సాయి దీపక్ ఎంపికయ్యాడు. కొరియా క్రీడాశాఖ, తైక్వాండో ప్రమోషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగనున్న ఈ శిక్షణ శిబిరానికి ఎంపికైన తొలి తెలుగు తైక్వాండో కోచ్‌గా దీపక్ నిలిచాడు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి ఎంపిక చేయబడిన 40 మంది కోచ్‌లు తైక్వాండో నిపుణుల సమక్షంలో నిబంధనలు, సంస్కరణలు, గాయాలు, స్పోర్ట్స్ సైకాలజీ గురించి శిక్షణ తీసుకోనున్నారు.*
*– హైదరాబాద్, ఆట ప్రతినిధి*

## తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చాలి

హిమాయత్‌నగర్, మే 31: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తికానున్న నేపథ్యంలో తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పదో ఆవిర్భావం సందర్భంగా విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తూ బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యూనివర్సిటీలకు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు.

## యువత సన్మార్గంలో పయనించాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్

కవాడిగూడ : వ్యసనాలకు దూరంగా ఉంటూ.. యువత సన్మార్గంలో పయనించాలని ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్, లయన్ జి. కృష్ణవేణి అన్నారు. పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని గోషాల వద్ద గల మోతీలాల్ నెహ్రూనగర్‌లో అంగన్‌వాడీ పిల్లలకు అవగాహన కల్పించారు. డ్రాయింగ్, వ్యాసరచన పోటీ లు నిర్వహించి, గెలుపొందిన వారికి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఫౌండర్ సెక్రెటరీ కే సాయిబాబా రెండు క్రికెట్, షటిల్, బాల్ బ్యాడ్మిం ట్ కిట్లు, పుస్తకాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కవిత, విద్యార్థులు, ఆయా విజయ పాల్గొన్నారు.

## కృంగిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



మ్యాన్‌హోల్ నిర్మాణ పనులు చేపడుతున్న జలమండలి అధికారులు

కవాడిగూడ, మే 31: భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలీ కాలనీ ప్రధాన రోడ్డులో మూడు రోజుల క్రితం మ్యాన్‌హోల్ కృంగిపోవడంతో మురుగునీరు ఇండ్లలోకి చేరింది. భోలక్‌పూర్ డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్ ముదిరాజ్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు సమస్య వివరించడంతో జలమండలి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం జలమండలి జనరల్ మేనేజర్ రామకృష్ణ, డీజీఎం కార్తిక్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని యంత్రాల సాయంతో మ్యాన్‌హోల్ వద్ద తవ్వి నూతన పైపులైన్ ఏర్పాటు వేశారు. సమస్య పరిష్కారానికి సహకరించిన ఉమాకాంత్ ముదిరాజ్, జీఎం రామకృష్ణ, డీజీఎం కార్తిక్ రెడ్డి, సెక్షన్ మేనేజర్ ప్రసాద్ బాబును స్థానికులు సన్మానించారు.

## దాడికి పాల్పడిన యువకుల రిమాండ్



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్

అడ్డగుట్ట, మే 31 : అకారణంగా నలుగురు విద్యార్థులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన యువకులను చిలకలగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ వివరాలను వెల్లడించారు. వారాసిగూడ ప్రాంతానికి చెందిన ఓ యువతి తన ముగ్గురు స్నేహితులతో కలిసి అక్బర్ హోటల్ సమీపంలో ఈ నెల 29న సాయంత్రం సమయంలో వీళంతా కలిసి చర్చించుకుంటున్నారు. అదే సమయంలో వారాసిగూడ, మహ్మద్ గూడ ప్రాంతాలకు చెందిన రహీం(24) మహ్మద్ షేక్ హుస్సేన్ అలియాస్ సోను(19), అహ్మద్ పాశ అలియాస్ అశిర్(19), వంశీ, మహ్మద్ సమీర్(20) అనే యువకులు సదరు యువతి, ఆమె స్నేహితులపై అకారణంగా దాడికి దిగారు. భయంతో పరుగులు తీసిన యువతి, సదరు యువకులను రహీం అండ్ గ్యాంగ్ బైక్‌లపై వెంబడించి కొట్టారు. వారి వద్ద నుండి రూ.1000 నగదు, సెల్‌ఫోన్‌లను లాక్కొని వెళ్లిపోయారు. దీంతో చేసేదేమి లేక బాధితులు స్థానిక చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తక్కువ సమయంలో పోలీసులు కేసును ఛేదించారు. ఇద్దరు మైనర్లతో పాటు ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. వారి వద్ద నుండి వెయ్యి రూపాయల నగదు, రెండు సెల్‌ఫోన్‌లను, వారు ఉపయోగించిన రెండు మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.




## పదవీ విరమణ వీడ్కోలు

*విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన వారికి ఎల్లప్పటికీ గుర్తింపు లభిస్తుందని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు అన్నారు. గాంధీ దవాఖానలో పనిచేస్తున్న నర్సింగ్ అధికారి బి.ప్రశాంతి, నర్సింగ్ ట్యూటర్ యమున, ఎఫ్‌ఎన్‌ఓ శోభారాణి, జూనియర్ అసిస్టెంట్ ఎం.ఎ.హఫీజ్‌ల పదవీ విరమణ సందర్భంగా సహోద్యోగులు వారికి ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ జయకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ మంగమ్మ, ఏడీ ఫ్లోరెన్స్ మర్లిన్, ఏఓ సుభాన్, ఓఎస్ రాంచందర్, టీఎన్‌జీఓ నాయకులు ప్రభాకర్, కలీమ్, ప్రసన్న, గోపాల్, మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.*
*– బన్సీలాల్‌పేట్, మే 31 :*

## పాఠ్య పుస్తకాలు సిద్ధం

జూబ్లీహిల్స్, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఖైరతాబాద్–2 మండలంలో 6 ఉన్నత పాఠశాలలు, 24 ప్రాథమిక పాఠశాలలతో పాటు 2 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలలకు 64,505 పాఠ్యపుస్తకాలు అవసరముండగా మొదటి విడత 15,600 పుస్తకాలు తరలించారు. మరో రెండు విడతల్లో మిగతా పుస్తకాలు తరలిస్తామని డిప్యూటీ ఐఓఎస్ శ్రవణ్‌కుమార్ తెలిపారు.

## వరదనీరు సాఫీగా వెళ్లేందుకు..



హుస్సేన్‌సాగర్ సర్‌ప్లస్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న డీసీ మారుతీదివాకర్

అంబర్‌పేట, మే 31: హుస్సేన్‌సాగర్ సర్‌ప్లస్ నాలాలో వరదనీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నట్లు జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ తెలిపారు. శుక్రవారం సర్కిల్ పరిధిలోకి వచ్చే హుస్సేన్‌సాగర్ సర్‌ప్లస్ నాలా ప్రాంతాలైన గోల్నాక కమేళా బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో డీఈ రఘు, ఏఎంఓహెచ్ డా.హేమలత, ఏఈ విఘ్నేశ్వరితో కలిసి వ్యర్థాలను తొలగించే పనులు పరిశీలించారు.

## నెలనెలా సాహిత్య పరిమళాలు..

తెలుగు యూనివర్సిటీ, మే 31 : కమలాకర సంగీత నృత్య కళాక్షేత్రం లైనెస్ క్లబ్ ఆఫ్ సంస్కృతి ఆధ్వర్యంలో నెలనెలా సాహిత్య పరిమళాలు శీర్షికన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాలల వేసవి సమ్మేళనం ద్వారా చిన్నారులకు సంగీతం, నృత్య కళలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమ ముగింపు వేడుకలు సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో జరిగాయి. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి, ధర్మ ప్రచారకులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆధ్యాత్మిక రచయిత్రి డాక్టర్ కె.వి. కృష్ణకుమారి చిన్నారుల కళాత్మక ప్రదర్శనలు వీక్షించారు.

## రోడ్డుపై డ్రైనేజీ పరుగు..



కాచిగూడ, మే 31 : కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డాలో నెల రోజులుగా రోడ్డుపైనే డ్రైనేజీ నీరు పొంగి పొర్లుతున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు తెలిపారు. దీంతో ఆ దారి గుండా వెళ్లే వాహనదారులకు దుర్వాసన వ్యాపించి అనేక ఇబ్బందులకు గురౌతున్నారు. రోడ్డుపైనే డ్రైనేజీ పొర్లుతుండటంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జగ్గుయాదవ్ లైన్‌లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు.

## నేడు హనుమాన్ జయంతి

హిమాయత్‌నగర్: హనుమాన్ జయంతి సందర్భంగా నేడు గ్రేటర్‌లోని పలు ఆలయాల్లో ఘనంగా మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ సహాయ కార్యనిర్వహణాధికారి చతుర్వేదల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకం, ఆకుపూజ, హనుమాన్ జయంతి విశిష్టత ప్రవచనాలు, చాలీసా పారాయణం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

